
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

బుధవారం 12 మార్చి 2025



తాగునీటి సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూమ్

సిరిసిల్ల టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కమిషనర్ సమ్మయ్య మంగళవారం తెలిపారు. తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే 7893593330 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

న్యాయవాదుల సమస్యలను పరిష్కరించండి

- జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జికి వినతి



హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావుకు ప్రసాదం అందజేస్తున్న న్యాయవాదులు

వేములవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ కోర్టులో నెలకొన్న న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని హైకోర్టు న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావుకు స్థానిక న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం నేతృత్వంలో పలువురు న్యాయవాదులు మంగళవారం హైదరాబాదులోని హైకోర్టు ప్రాంగణంలో జస్టిస్ రాజేశ్వరరావును కలిసి రాజరాజేశ్వరస్వామి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ వేములవాడకు అడిషనల్ కోర్టు మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న కోర్టు బిల్డింగ్‌పై అదనపు అంతస్తు నిర్మాణం చేయాలని, కక్షిదారులకు మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నక్క దివాకర్, పంపరి శంకరయ్య, గుజ్జె మనోహర్ ఉన్నారు.

16న సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం

సిరిసిల్ల రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం రాజన్న సిరిసిల్ల జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని ఈనెల 16న సిరిసిల్లలో ఏర్పాటుచేశామని కార్యదర్శి మూషం రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్ లాల్‌శుక్లా భవనం ఎదుట మంగళవారం సీపీ ఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం కరపత్రాలను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. 16న సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ అర్‌ఎంపీ భవనంలో జరిగే జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతారని తెలిపారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మానేరువంతెన నుంచి బైక్ ర్యాలీతో స్వాగతం పలుకాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లారపు అరుణ్‌కుమార్, విమల, జిల్లా కమిటీ స భ్యులు ఎరవెల్లి నాగరాజు, మాల్లారపు ప్రశాంత్, సంపత్‌కుమార్, సరిమల్లెసత్యం, ఉడుత రవి, కళ్యాణ్, మనోజ్, సంధ్య, గాజులు రాజు, అడెపు రాజు, సదానందం, బడుగు రాములు, వంగ సుదర్శన్, మేర్గు మహేష్‌లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

వేములవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలో పని చేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి యేసురత్నం అన్నారు. ఈ మేరకు మంగళవారం నాడు వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి కడారి రాములు, మల్లేశం, రాజ య్య తదితరులు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

సిరిసిల్ల టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిని ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని స్కానింగ్ సెంటర్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోఎంహెచ్ఎన్ ఇన్‌చార్జి డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలను నిర్వహిస్తున్నామని అన్నారు. స్కానింగ్ సెంటర్లలో ఫారం ఎఫ్ రికార్డులను రిపోర్టులను పరిశీలించి లోపాలను గుర్తించి సరిచేసుకోవాల్సిందిగా నిర్వాహకులకు, డాక్టర్లకు సూచించారు. గర్భ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం అని హెచ్చరించామని తెలిపారు.

ఈ తనిఖీలలో సిబ్బంది రాజ్‌కుమార్, బాలయ్య, ఉమెన్స్ వెల్ఫేర్ దేవిక, మహేష్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 140 మంది గైర్హాజరు..

సిరిసిల్ల రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.సిరిసిల్ల జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 4449మందికి 4309 మంది హాజరుకాగా, 140 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 3938 మందికి 3845 మంది హాజరుకాగా 93మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో511 మంది విద్యార్థులకు 464 మంది విద్యార్థులు హాజరుకాగా 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సిరిసిల్ల పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను మంగళవారం ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు.

ఎండలో 'ఉపాధి'

- నీడలేదు.. నీళ్లు లేవు..
- పని ప్రదేశంలో సౌకర్యాలు కరువు
- గిట్టుబాటు కాని కూలి..
- మూడేళ్లుగా జాడలేని వేసవి భత్యం
- రాబోయే ఆర్థిక సంవత్సరానికి 26,75,383 లేబర్ బడ్జెట్ పనిదినాలు

ఆంధ్రజ్యోతి విజిట్



ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలో కూలీలు



తంగళ్లపల్లిలో ఉపాధి పనుల్లో కూలీలు



ఇల్లంతకుంటలో..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల/నెట్‌వర్క్)

అప్పుడే ఎండలు భగ్గుమంటున్నాయి.. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతూ నీడపట్టున ఉంటున్నారు. కానీ రాజన్న సిరిసిల్లజిల్లాలో ఉపాధిహామీకూలీలు మాత్రం ఎండలో మాడిపోతున్నారు. నీడ, తాగునీరు వంటి కనీస సౌకర్యాలులేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా చేసిన పనికి కూలిగిట్టుబాటు కావడం లేదు. ఉపాధిహామీ కూలీలు పడుతున్న ఇబ్బందులు.. వారికి అందుతున్న సౌకర్యాలపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' రాజన్నసిరిసిల్ల జిల్లా బృందం పని ప్రదేశాలను విజిట్ చేసింది. పని ప్రదేశాల్లో ఎండలో ఉపాధి పొందుతూ కూలీలు ఆవేదనను వ్యక్తం చేశారు.

● వేసవి భత్యం దూరం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో 90వేల జాబ్‌కార్డులు ఉండగా, 2లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇందులో 64వేల జాబ్ కార్డుల ద్వారా మాత్రమే నిత్యం పనిచేస్తున్నారు. గతంలో వేసవి సమయంలో సమ్మర్ అలవెన్స్‌లు అందించేవారు. ఐదునెలల పాటు వేసవి దృష్ట్యా అందించే భత్యం మూడేండ్లుగా అందడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పనులపై అజామాయిషీ చేస్తూ సాఫ్ట్‌వేర్‌ను మార్చారు. 2022 వరకు దేశమంతా ఒకే విధానంతో ఉండేది. ఆ సమ యంలో వేసవి అలవెన్స్ కింద ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25 శాతం ఏప్రిల్, మేలో 30శాతం, జూన్‌లో20 శాతం అందించేవారు. రాష్ట్ర ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌లో మాత్రమే సమ్మర్ అలవెన్స్‌లు జమ చేసేవారు. కేంద్ర ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌లో సమ్మర్ అలవెన్స్‌లో ఆప్షన్ అవకాశం లేకపోవడంతో 2022 నుంచి నిలిచిపోయింది. ఉపాధిహామీ పనుల అంచ నాల్లో ఏడాది కాలంలో కనీసం వంద రోజులు తగ్గకుండా పని అందించాలనే లక్ష్యం ఉంది. గతంలో ఒక గ్రామంలో కనీసం 200 మంది వరకు పనిచేసే విధంగా పెద్దపెద్ద పనులు, చెరువుల మరమ్మతులు లాంటివి చేసేవారు. ఇప్పుడు ఎక్కువ శాతం చెట్లకు నీళ్లుపోయడం వంటివే చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈసారి వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాలు అతి తక్కువగా ఉండడం గమనర్హం. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో లేబర్ బడ్జెట్‌లో ఫిబ్రవరి వరకు 27.55 లక్షల పనిదినాలకు 22 లక్షల వరకు పూర్తి చేశారు. స్థానిక అవసరాల రీత్యానే పనులు కల్పిస్తున్నారు.

● 26.75 లక్షల పనిదినాల లక్ష్యం...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనిదినాలు కల్పించడానికి రూ.80.26కోట్ల అంచనా బడ్జెట్‌తో 26.75లక్షల పనిదినాలు లక్ష్యంగా పెట్టుకు న్నారు. జిల్లాలో 255 గ్రామాల్లో సభలు నిర్వహించి పనులను గుర్తించారు.

గ్రామాల్లోఉన్న నిరుపేద కుటుంబాలకు లబ్ధిచేకూరే విధంగా 60శాతానికి తగ్గకుండా మండల స్థాయిలో వ్యవసాయ సంబంధిత పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. లేబర్ బడ్జెట్ పనిదినాల్లో బోయినపల్లి మండలంలో 1,40,710 పనిదినాలు లక్ష్యంగా పెట్టుకోగా, చందుర్తిలో 2,44, 424, ఇల్లంతకుంటలో 2,63,735, గంభీరావుపేటలో 3,66,733, కోనరావు పేటలో 3,02,552, ముస్తాబాద్‌లో 2,51,286, రుద్రంగిలో 69,347, తంగళ్లపల్లిలో 3,34,000, వీర్నపల్లిలో 2,35,000, వేములవాడలో 45,200, వేములవాడ రూరల్‌లో 1,46,730, ఎల్లారెడ్డిపేటలో 2,75,666 పని దినాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. పనిదినాలను 2025 సంవత్సరంలో ఏప్రిల్ మాసంలో 4,36,477 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. మేనెల వరకు 8,65,202 పనిదినాలు, జూన్‌వరకు 11,19,603 పనిదినాలు, జూలై వరకు 12,31,258 పనిదినాలు, ఆగస్టువరకు 13,37,300 పనిదినాలు, సెప్టెంబరు వరకు 14,43,862 పనిదినాలు, అక్టోబరువరకు 15,58,084 పనిదినాలు, నవంబరు వరకు 16,92, 632 పనిదినాలు, డిసెంబరు వరకు 18,42,542 పనిదినాలు, 2026 సంవత్సరంలో జనవరి వరకు 20,25,122 పనిదినాలు, ఫిబ్రవరివరకు 23,08,391 పనిదినా లు, మార్చి వరకు పూర్తిగా 26,75,383 పనిదినాలు లక్ష్యాన్ని పూర్తిచేసే విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. కానీ ఉపాధిహామీ కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

● ఇల్లంతకుంటలో..

వలసల నివారణకు ప్రభుత్వం కొనసాగిస్తున్న ఉపాధిహామీ పనులవద్ద వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మండలంలో 33గ్రామపంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నాయి. పనులకు ప్రతిరోజు 1100మంది కూలీలు వస్తున్నారు. ఉపాధిహామీ పథకం కింద చేపల చెరువు, ఫాంపాండ్‌లు, ఫీడర్‌చానల్, ఖండిత కందకాల పనులు కొనసాగుతున్నాయి. పనుల వద్ద తాగునీరు. నీడ ఏర్పాటు చేయడం గ్రామపంచాయతీలకు అప్పగించారు. తాగునీటి సౌకర్యం అన్ని గ్రామాల్లో ఉండగా, చలువ పందిళ్లు ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు.

● ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద అధికారులు భూఅభివృద్ధి, నీటి కుంటలు, కాల్వల పూడికతీత పనులను చేపట్టారు. మొత్తం 12234 మందికి జాబ్ కార్డులుండగా ప్రతి రోజు గ్రామాల్లో 6వేల మంది మండుతున్న ఎండల్లోనే కూలీలు పనులు చేస్తున్నారు. ఎలాంటి చలువ పందిళ్లను ఏర్పాటు చేయలేదు. తాగేందుకు నీళ్లను కూలీలే ఇళ్ల వద్ద నుంచి తీసుకెళుతున్నారు. పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేవు. ఎండ తీవ్రతకు ఎవరైనా కూలీలు అస్వస్థతకు గురైతే దగ్గరలోని చెట్ల కిందకు తీసుకెళుతున్నారు. రాచర్లబొప్పాపూర్ గ్రామంలో ట్యాంకరు లేకపోవడం వల్ల ఉపాధి కూలీలు రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలాలనుంచి బిందెలతో నీళ్లు మోసుకొచ్చి మొక్కలకు పోస్తున్నారు. అసౌకర్యాల నడుమ పనులు చేయాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు.

● చందుర్తిలో..

మండలంలోని 19 గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం జాబ్ కార్డులు 7,933 ఉండగా, 4,805 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఎండలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం ....

మిగతా8లో

26న అర్బన్ బ్యాంక్ మహాసభ

- డివిడెండ్ పంపిణీకి ఏర్పాట్లు
- చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ సభ్యులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 12 శాతం డివిడెండ్‌ను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్‌లో 7200 మంది సభ్యులు ఉన్నారని, 4600 మంది సభ్యులకు మాత్రమే ఖాతాలు ఉన్నాయని అన్నారు. ఖాతాలు లేని సభ్యులు సేవింగ్ ఖాతాలను తీసుకోవాలని అన్నారు. డివిడెండ్‌ను ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని అన్నారు. సేవింగ్ ఖతాలకు కేవైసీ చేసుకోవాలని తెలిపారు. ఇతర బ్యాంక్‌ల కంటే టర్మ్‌ల డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నామని సిరిసిల్ల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బ్యాంక్ అర్థ వార్షిక మహాసభ ఈనెల 26న 11 గంటలకు పద్మశాలీ కళ్యాణ భవనంలో నిర్వహించడం జరుగుతుందని సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల చుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, ఎనగందుల శంకర్, వరుస హరిణి, పత్తిపాక సురేష్, కోడం సంజీవ్, బ్యాంక్ సీఈవో పత్తిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు రుణ ప్రణాళిక విడుదల

- 2025-26 జిల్లా రుణ లక్ష్యం రూ.3,948 కోట్లు
- పీఎల్‌పీని విడుదల చేసిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఆర్థిక సంవత్సరం 2025-26 జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్(నాబార్డు) రుణ ప్రణాళికను విడుదల చేసింది. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాకు సంబంధించిన ప్రొటెన్షియన్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్ (పీఎల్‌పీ)ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విడుదల చేశారు. జిల్లాకు రూ.3948.01 కోట్ల రుణ సహాయాన్ని అందించాలని జిల్లాలోని బ్యాంక్‌లకు నిర్దేశించింది. గతేడాది లక్ష్యం కంటే 23 శాతం అదనంగా రూపొందించారు. వ్యవసాయానికి రూ.3189.07 కోట్లు, సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమలకు రూ.612.30 కోట్లు, ఎగుమతులకు రూ.3.20 కోట్లు, విద్యారంగానికి రూ.28 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.40.04 కోట్లు, సామాజిక మౌళిక సదుపాయాలకు రూ.10.80 కోట్లు, ఇందన రంగానికి రూ.31.10 కోట్లు, ఇతర విభాగాలకు రూ.33.50కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం దిలీప్‌చంద్ర, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు, డీఆర్‌డీవో బి శేషాద్రి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



విద్యార్థినికి కళ్లజోడు ధరింపజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ బోధన అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 338కంటి అద్దాలను పంపిణీ చేశామని, అవసరమైన వారికి శస్త్రచికిత్సల కోసం హైదరాబాద్‌లోని సరోజిని కంటి ఆసుపత్రికి పంపుతామని కలెక్టర్‌కు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కలెక్టర్ కంటి అద్దాలను అందజేశారు. తదనంతరం విద్యాలయంలోని తరగతి గదులను, కిచెన్, స్టోర్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.సంపత్, ఆర్.బి.ఎస్.కె. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నయీం జహా, మెడికల్ ఆఫీ సర్ కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

వేములవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వారి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించి వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రజిత, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, మండల విద్యాధికారి బన్నాజీ, జీఈసీవో పద్మజ, వైద్యాధికారులు నహిమ జహ, సంపత్, ఏఎన్ఎం శైలజ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కమాండెంట్ మృతికి కేటీఆర్ సంతాపం

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ తోట గంగారాం మృతికి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తెలంగాణ సచివాలయం సీఎస్‌వోగా పనిచేశారని గుర్తు చేశారు. పోలీస్ శాఖలో ఉన్నత సేవలు అందిస్తూ ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సోమారంపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారంపేటలో సీసీ రోడ్డు పనులను ఏఎంసీ డైరెక్టర్ ఐరెడ్డి సురేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. నిధులు మంజూరు చేసిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్డె నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రియాంకతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

కరీంనగర్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లిలో యువకుడు, సైదాపూర్ మండలంలోని ఆకునూర్ భూషణగట్ల వద్ద ఓ వ్యక్తి, మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు.

మనస్తాపంతో యువకుడు..


కరుణాకర్ (ఫైల్)

సైదాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బొడిగ కరుణాకర్ (38) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బొడిగ కరుణాకర్ ఈ నెల 9న ఆకునూర్ గ్రామానికి వెళ్లాడు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళతో పాటు పలువురు విచక్షణారహితంగా దాడి చేశారు. మనస్తాపానికి గురైన కరుణాకర్ పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాంబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్ఐ తిరుపతి తెలిపారు.

అనారోగ్య సమస్యలతో ఒకరు..


నర్సింహాచారి (ఫైల్)

సైదాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆకునూర్ భూషణగట్ల వద్ద బండోజు నర్సింహాచారి (53) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన బండోజు నర్సింహాచారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నర్సింహాచారికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక జనవరి 8న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకు ఇంటికి రాకపోయే సరికి కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం ఆకునూర్ గ్రామశివారులోని భూషణగట్ల వద్ద ఉరేసుకొని ఉన్న మృతదేహం కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిరుపతి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాల సేకరించారు. మృతుడి అల్లుడు ఓంప్రకాష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

మానసికస్థితి సరిగా లేక ఓ వ్యక్తి..

మానకొండూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పోలం అంజయ్య (53) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంజయ్యకు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కరీంనగర్‌లోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినట్లు తెలిపారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్న అంజయ్య తెల్లవారే సరికి ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన తీరును పరిశీలించారు. మృతుని కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్ళిన ఓ ఇంట్లో దొంగలు తాళాలు పగులగొట్టి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మల్యాలలో చోటు చేసుకుంది. మల్యాల మండల కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన అస్మ సుల్తానా కుటుంబసభ్యులు ఈ నెల 6వ తేదీన జగిత్యాలలోని బంధువుల ఇంటికి వెళ్లారు. కాగ మంగళవారం ఇంటికి రాగ తాళం పగులగొట్టి ఉండి ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురై కనిపించాయి. బీరువాలోని రూ.25వేల నగదుతో పాటు అయిదు తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటన స్థలం పరిశీలించి దర్యాప్తు జరుపుతున్నారు.

జ్వరంతో పదో తరగతి విద్యార్థిని మృతి


రమ్య(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన బండారి రమ్య(14) అనే పదో తరగతి విద్యార్థిని తీవ్రజ్వరంతో మంగళవారం మృతి చెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బండారి పెద్ద రమేష్-సంపూర్ణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ జమ్మికుంటలో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నకుమార్తె బండారి రమ్య గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. 20 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుండగా చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లిన తగ్గలేదు.

సోమవారం రాత్రి తీవ్రజ్వరం రావడంతో చికిత్సకోసం ఉదయం ఆసుపత్రికి తీసుకెళ్దామని అనుకునే లోపు మంగళవారం మృత్యువాత పడింది. నిరుపేద కుటుంబం కావడం మూలంగా సరైన చికిత్స అందక బాలిక మృతి చెందటంపై గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'బోరు'మంటున్నారు..

- అడుగంటిన జలాలు.. కాలిపోతున్న మోటార్లు..
- పంటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు


వ్యవసాయ బోరు మోటారును పైకి తీస్తున్న కూలీలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.. వ్యవసాయ బోరు మోటార్లపై లోడ్ ఎక్కువై కాలిపోతున్నాయి. దీంతో సాగునీరు అందక ఎండుతున్న పంటలను చూసి రైతులు 'బోరు'మంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పొట్ట దశకు వచ్చిన పంటకు సాగు నీరు అందిస్తే దిగుబడి వస్తుందనే ఆశతో రేయింబవళ్లు శ్రమిస్తున్నారు.

కాలుతున్న బోరు మోటార్లు..

మండలంలోని గుండారం, రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, అల్మాస్‌పూర్, దేవునిగుట్టతండా, వెంకటాపూర్, రాచర్ల తిమ్మాపూర్, బాకురుపల్లి తండా తదితర గ్రామాల్లోని రైతులు వరి పంటలను సాగుచేశారు. నాటు పూర్తయిందని అనుకున్న రైతుల గుండెల్లో అడుగంటిన జలాలు ఆందోళన కలిగించాయి. ధారలా వస్తున్న నీరుతో తడులు పారక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. 24 గంటల పాటు వ్యవసాయ బోరు మోటార్లు నడిచేలా ఆటో స్టార్టర్లను బిగించారు. దాంతో నీరు అందక.. నాణ్యమైన విద్యుత్ సరఫరా కాక మోటార్లు కాలిపోతున్నాయి. చేసేదేమీ లేక వేల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఒక్కో రైతు సుమారు రూ.8 నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. మండలంలో ఇప్పటికే సుమారు 120 మందికి చెందిన వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోయాయని బాధిత రైతులు పేర్కొన్నారు. ఒక్కో రైతు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వెచ్చిస్తున్నారని వాపోతున్నారు. కాలిపోయిన బోరు మోటార్ల మరమ్మతుల కోసం సుమారు రూ.9.60 లక్షలు ఖర్చు చేశారని చెబుతున్నారు. అప్పులు చేసి పంటను దక్కించుకునేందుకు అవస్థలు పడినా పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి..
పృథ్వీధర్, సెస్ ఏఈ



మండలంలోని రైతులు వ్యవసాయ బోరు మోటార్లకు ఆటో స్టార్టర్లను బిగించడం వల్ల కరెంటు ఉన్నంత సేపు మోటార్లు నడుస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీరు అందక మోటార్లు కాలిపోతున్నాయి. బోరు మోటార్లు కాలిపోకుండా కెపాసిటర్లను బిగించుకోవాలి.


బోరు మోటార్లకు మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

కూలీలు, మరమ్మతులకు రూ.9 వేలు వెచ్చించా..
గూడెపు నర్సయ్య, రైతు, గుండారం



నాకున్న భూమిలో రెండు వ్యవసాయ బోరు బావులున్నాయి. వాటిపై ఆధారపడి రెండెకరాల్లో వరి పంటను సాగు చేశా. ఓ బోరు ఎత్తేసింది. ఉన్న ఒక్క బోరు బావి అందిస్తున్న నీటితో తడులు పెడుతున్నా. పంట పొట్ట దశకు వచ్చింది. బోరు మోటారు కాలిపోయింది. మోటారు తీసేందుకు రూ.4 వేలు చెల్లించి బయటకు తీయించా. గొల్లపల్లిలోని రిపేరు షాపునకు తీసుకువచ్చాను. మరమ్మతుకు మరో రూ.5 వేలు అయ్యాయి. కూలీలు, మరమ్మతులకు మొత్తం రూ.9 వేలు ఖర్చు చేశా. పంట చేతికందినా పెట్టుబడులు, ఖర్చులు కూడా వచ్చేట్టు లేవు.

హత్య కేసులో పురోగతి

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీనగర్‌కు చెందిన క్రశ్రీపాయింట్ నిర్వాహకుడు బాలసాని రాము హత్య కేసులో పోలీసులు కొంత పురోగతిని సాధించారు. ఇప్పటికే రాము బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఈ కేసుతో సంబంధం ఉన్నట్లుగా అనుమానిస్తున్న కరీంనగర్‌కు చెందిన ఇద్దరిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు ఇచ్చిన సమాచారంతో ప్రధాన నిందితుడైన సంతోష్‌ను పట్టుకునేందుకు స్పెషల్ పోలీసుటీంలు రంగంలోకి దిగినట్లు సమాచారం. సంతోష్ పట్టుబడితే అసలు విషయం వెల్లడయ్యే అవకాశాలున్నాయి. బాలసాని రాము మృతదేహానికి మంగళవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

● న్యాయం చేయాలి

తన భర్త రామును డబ్బుల కోసం హత్య చేశారని మృతుడి భార్య లతశ్రీ ఆరోపించింది. తమకు న్యాయం చేయాలని కోరింది. రాముకు సంతపురి సంతోష్ దగ్గరి స్నేహితుడని, శనివారం పదేపదే ఫోన్ చేయడంతో రూ.25 వేల వరకు నగదు, ఏటీఎం కార్డును తీసుకొని సంతోష్ గదికి వెళ్లాడని తెలిపింది. డబ్బుల కోసమే రామును హత్య చేశారని అతడి సోదరుడు ఆరోపించాడు.

ప్రమాదవశాత్తు
17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ మృతి


నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఇన్‌సెట్‌లో గంగారాం(ఫైల్)

సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం లోని వెంకట్రావునగర్‌లోని ఓ మూడంతస్తుల భవనంపై నుంచి ప్రమాదవశాత్తు లిఫ్ట్ గోతిలో పడి సర్ధాపూర్ 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ తోట గంగారాం (59) మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 10.30గంటలకు తన స్నేహితుడైన సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి కూతురు మృతిచెందగాగా అద్దెకు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావుతో కలిసి అడిషనల్ కమాండెంట్ గంగారాం వెళ్లారు. తిరిగి వెళుతున్న క్రమంలో బటన్ నొక్కగా సేఫ్టీ గేట్ తెరుచుకుంది. లిఫ్ట్ వచ్చిందనుకొని ముందుకు అడుగువేయగా ప్రమాదవశాత్తు ఒక్కసారిగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై పడి చాతి, ఎడమకాలు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న మిగతా పోలీస్ అధికారులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గంగారాంను బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. తెలంగాణ సచివాలయంలో సీఎస్‌వోగా పనిచేసిన 1989బ్యాచ్‌కు చెందిన గంగారాం సిరిసిల్ల పట్టణంలోని సర్ధాపూర్ 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా మూడునెలల క్రితమే విధుల్లో చేరారు. మరో రెండేళ్లలో రిటైర్ కావాల్సి ఉంది. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని సిద్దులం గ్రామానికి చెందిన గంగారాం హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. గంగారాంనకు భార్య రేఖ, కొడుకు సతీష్‌కుమార్, ఇద్దరు కూతుళ్లు గౌతమి, మీనల్‌లు ఉన్నారు. ఈ సంఘటన తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు సిరిసిల్లకు తరలివచ్చి విలపించడంతో జిల్లా ఆసుపత్రి వద్ద విషాదం అలుముకుంది. సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

● శ్రద్ధాంజలి ఘటించిన కలెక్టర్..

అడిషనల్ కమాండెంట్ గంగారాం పార్థివదేహానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, 1వ, 3వ బెటాలియన్ కమాండెంట్‌లు మురళీకృష్ణ, జమీల్‌పాష, 17వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, రాందాస్, అధికారులు, సిబ్బంది పుష్పాంజలి ఘటించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి


వెంకటేష్ (ఫైల్)

కోల్‌సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శ్రీనగర్‌కాలనీ నుంచి మున్సిపల్ హెడ్ వర్క్స్ రహదారిలో మల్కాపూర్ శివారు నాలాలో పడి మానాల వెంకటేష్ (47) అనే వ్యక్తి మృతి చెందాడు. మంగళ వారం ఉదయం పనికి వెళ్లేందుకు స్కూటీ పై వెళుతుండగా ప్రమాదవశాత్తు అందు లో పడ్డాడు. గతంలో గోదావరి వరదలకు కాలువ వద్ద కూలిపోయింది. దీంతో ప్రమా దవశాత్తు వెంకటేష్ అందులో పడిపోయా డు. భార్య స్వప్న, కూతుర్లు రష్మిక, హారిక ఉన్నారు. వెంకటేష్ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కే రమేష్ పేర్కొన్నారు.

బైక్ ఢీకొని సైక్లిస్టు మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన నాయిని రాజయ్య(59) మానేరు బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... రాజయ్య తన సైకిల్‌పై వెల్జిపూర్ గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో మానేరు బ్రిడ్జి వద్ద వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చిన బుల్లెట్ వాహనం ఢీకొంది. తీవ్రగాయాలతో ఉన్న రాజయ్యను చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై రమేశ్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన శీతల్లి మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

గంజాయి చాక్లెట్లు పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హౌజింగ్ బోర్డు కాలనీలో కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు మంగళవారం నిర్వహించిన తనిఖీలలో కిలోన్నర గంజాయి చాక్లెట్‌లు పట్టుబడ్డాయి. మూడో ఠాణా పోలీసుల వివరాల ప్రకారం... హౌజింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ జిమ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద ఆరు ప్యాకెట్లలో 1 కిలో 460 గ్రాముల గంజాయి చాక్లెట్‌లు పట్టుబడ్డాయి. గంజాయి చాక్లెట్లతో పట్టుబడినవారిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బస్తీ జిల్లా నౌవా గ్రామానికి చెందిన మహేష్‌కుమార్ గౌతం(40) అనే వ్యక్తి ప్రస్తుతం కాపువాడలో నివాసం ఉంటున్నాడు. మరొకరు మహారాజ్ గంజ్ జిల్లా కరూపర్ గ్రామానికి చెందిన బబుల్(24) ప్రస్తుతం కరీంనగర్ అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి నిషేధిత గంజాయి చాక్లెట్‌లతోపాటు రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. హౌజింగ్ బోర్డు కాలనీ ఓపెన్ జిమ్ వద్ద కొందరికి గంజాయి చాక్లెట్లు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామ మానేర్ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీస్‌లు మంగళవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఎమ్ ప్రశాంత్, కె ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ప్రియురాలు పట్టించుకోవడం లేదని..

- టవర్ ఎక్కిన ట్రాక్టర్ డ్రైవర్
- పోలీసుల చొరవతో సుఖాంతం


ఎన్టీపీసీలో టవర్ ఎక్కిన అజయ్

జ్యోతినగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రియురాలు తనను పట్టించుకోవడం లేదనే కారణంతో అజయ్ అనే ట్రాక్టర్ డ్రైవర్ మంగళవారం ఎన్టీపీసీ మేడిపెల్లి సెంటరులోని హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కాడు. మూడు గంటలపాటు అందరిని హైరానాకు గురి చేశాడు. చివరికి ఎన్టీపీసీ పోలీసులు చొరవ తీసుకొని ప్రియురాలిని రప్పించి అజయ్‌కు నచ్చజెప్పడంతో టవర్ దిగాడు. స్థానిక వీకే రామయ్య కాలనీకి చెందిన అజయ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అజయ్ రామగుండంకు చెందిన కూలీ పనులు చేసుకునే ఒక మహిళతో సఖ్యత ఏర్పడింది. అయితే నిత్యం మద్యం తాగి వచ్చి మహిళను వేధిస్తున్నాడు. దీంతో ఆ మహిళ అతన్ని పట్టించుకోవడం మానేసింది. తనతో మాట్లాడడం లేదని, పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో మంగళవారం అజయ్ టవర్ ఎక్కాడు. ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ ఎంత ప్రయత్నించినా కిందకు దిగలేదు. చివరికి సదరు మహిళను పిలిపించి సముదాయించడంతో టవర్ దిగాడు. అజయ్‌ను ఎన్టీపీసీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


గంగాధర్ (ఫైల్)

చందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం మల్యాల గ్రామం చెందిన పోతరాజు గంగాధర్ (45) అనే వ్యక్తి ఈనెల 8న చందుర్తి నుంచి మల్యాలకు బైక్‌పై వెళుతున్నాడు. సనుగుల గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి మల్యాల నుంచి చందుర్తికి బైక్ వెళ్తుండగా వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిలోని ఎల్లంపల్లి కాల్వ సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గంగాధర్‌కు తీవ్రగాయాలు కాగా హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గంగాధర్ బావ బుర్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

పరిశ్రమల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న డీవైసీఎఫ్ వై గంగాధర్‌రెడ్డి

జ్యోతినగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల యాజమాన్యాలు భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్(కరీంనగర్) వై గంగాధర్‌రెడ్డి అన్నారు. ఎన్టీపీసీలో నిర్వహిస్తున్న జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఏడీఎం బిల్డింగ్ ఆ వరణలో జరిగిన ముగింపు కార్యక్రమానికి గంగాధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భద్రతా వ్యవస్థ బాగుంటేనే పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. భద్రత విషయంలో ఉద్యోగులను చైతన్యవంతుల్ని చేసే బాధ్యత యాజమాన్యాలపైనే ఉందని తెలిపారు. ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత మాట్లాడుతూ భద్రతతో కూడిన విద్యుత్ ఉత్పత్తికి కృషి చేస్తున్నామన్నారు. భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ ముకేష్ కుమార్, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్

మొన్న కొండాపూర్.. నేడు సూరంపేటలో..

- పెద్దపులి కదలికలతో ఆందోళనలో ప్రజలు
- అప్రమత్తం చేసిన అటవీ అధికారులు


ప్రజలతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

కొడిమ్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో మొన్న కొండాపూర్ గ్రామ శివారులో నేడు సూరంపేట అడవిలో పెద్దపులి కదలికలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని సూరంపేట, గంగారాంతండా అడవిలో మంగళవారం పెద్దపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అడవిని ఆనుకొని ఉన్న నర్సరీలో మొక్కలకు నీటిని పోయటానికి బూక్య దీప్తి, బూక్య గోరీ అనే ఇద్దరు ఉపాధిహామీ కూలీలు వెళ్లారు. పెద్దపులిని గోరీ అనే మహిళ పరిగెత్తగా కింద పడి స్వల్పంగా గాయాలైనట్లు అటవీ అధికారులు తెలిపారు. గ్రామస్థులు పెద్దపులి కదలికలపై అటవీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్, డీఆర్వో ముషీర్‌అహ్మద్, పలువురు బీట్ అధికారులు పెద్దపులి కనిపించిన అటవీ స్థలానికి వెళ్లారు. సూరంపేట, గంగారాంతండా ప్రజలకు కనిపించింది ఏమిటని, ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కొందరు పెద్దపులి అనగా, మరికొందరు చిరుతపులి అని సమాధానమిచ్చారు. అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేంజర్, డీఆర్వో, సిబ్బంది అవగాహన కల్పించారు. గత జనవరి 24న మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపింది. నాలుగురోజుల క్రితం మండలంలోని దమ్మయ్య పేట-రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామ శివారులో గేదెపై పెద్దపులి దాడి చేసిందన్న వదంతులు వినిపించాయి. కొడిమ్యాల మండలంలోని సూరంపేట గంగారాం తండా అడవిలో పెద్దపులి సంచారం సమాచారంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి అడుగుల జాడ కోసం అటవీ అధికారులు సిబ్బంది గాలిస్తున్నారు. కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్, డీఆర్వో ముషీర్‌అహ్మద్, కొడిమ్యాల, మల్యాల మండలాల ప్రజలను అప్రమత్తం చేశారు.

ఈ విషయమై కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పెద్దపులి కదలికలు ఉన్నట్లు తాము తెలుసుకున్నామన్నారు. పెద్దపులి సంచరించిన ఆనవాళ్లు, ఆధారాలు పూర్తిగా లభిస్తే పూర్తి నిర్ధారణ చేస్తామన్నారు. పెద్దపులి కొడిమ్యాల మండలంలోని సూరంపేట, గంగారాంతండా అడవిలో సంచరిస్తున్నట్లు బావిస్తున్నామని తెలిపారు. ప్రజలు, రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


నర్సవ్వ (ఫైల్)

చందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బండారి నర్సవ్వ (102) వయోభారంతో మంగళవారం మృతి చెందింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. నర్సవ్వకు ఆరుగురు సంతానం. ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తె మృతి చెందింది.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కల్వల రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ఆటోలో 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సుల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన ఆటో యజమాని మానుపటి జయశంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.



అంతర్జాతీయ స్థాయిలో సాధించిన బంగారు పతకంతో ఆమని



జాతీయ స్థాయిలో ఐదవ స్థానం సాధించినందుకు..



తెలంగాణ జిల్లాల స్థాయి యోగా పోటీలో గోల్డ్ మెడల్ అందుకుంటూ..

యోగాలో రాణిస్తున్న ఆమని

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకాలు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి

సుల్తానాబాద్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణం మార్కండేయ కాలనీకి చెందిన జాపతి ఆమని యోగా పోటీలలో రాణిస్తోంది. యోగాలో రెండేళ్ల పాటు శిక్షణ పొందిన ఆమె జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటూ పతకాలు సాధిస్తోంది. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి యోగా పోటీలో బంగారు పతకం సాధించి రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప జేసింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొంటూ ఇప్పటివరకు ఐదు బంగారు పతకాలు సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి 16 వరకు కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొంది. ఈ పోటీలలో ఐదవ స్థానాన్ని సాధించి కేరళ ముఖ్య మంత్రి చేతుల మీదుగా పతకాలను అందు కున్నారు. ఈ పోటీలలో దేశం నుంచి ఆరుగురిని మాత్రమే ఎంపిక చేయగా తనకు ఐదవ స్థానం దక్కిందని ఆమని తెలిపారు.



అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం

గతేడాది నేపాల్‌లో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్‌లో ఆమని పాల్గొని బంగారు పతకం సాధించింది. 2023లో గోవాలో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ తరపున నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించింది. పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో యోగా ప్రచార సమితి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ వచ్చింది. కలకత్తాలో తెలంగాణ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఫెడ రేషన్ కప్ సాధించింది. కలకత్తాలో జరిగిన ఫెడరేషన్ పోటీలలో రెండుసార్లు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆమని ఎంపికైంది. పంజాబ్‌లో ఖేల్ యువరత్న పురస్కార్ అవార్డు అందుకొంది. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది.



బంగారు పతకమే లక్ష్యం

జాపతి ఆమని, అంతర్జాతీయ యోగా క్రీడాకారిణి

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన యోగా పోటీలలో పాల్గొని ప్రతిభను నిరూపించుకున్న. ప్రస్తుతం ఆసియన్ గేమ్స్, ఒలింపిక్స్ లక్ష్యంగా ఎదురుచూస్తున్నా. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప జేయాలని ఉంది. అందుకు కఠోర శిక్షణ పొందుతున్నా. రెఫరీ కోసం రాసిన పరీక్షల్లో సెలక్ట్ అయినా దానిని కాదనుకుని ఒలంపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా ఉన్నా.

యోగాలో పతకాల పంట పండించాలి

చెలుకు వాసుదేవరెడ్డి, యోగా నిపుణులు

యోగా పోటీలలో పతకాల పంట పండించాలి. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న యోగా క్రీడాకారులు క్రీడా ప్రతిభను చాటుకోవడం, పతకాలు సాధించడం అభినందనీయం. ప్రభుత్వం యోగాను ఒక క్రీడగా గుర్తించింది. ఎందరో యోగా క్రీడాకారులు స్పోర్ట్స్ సర్టిఫి కెట్లతో ఉన్నత స్థాయిలో ఉన్నారు. యోగాతో మానసిక ప్రశాం తత చేకూరి దినచర్య ఆటంకాలు లేకుండా సాగుతుంది.

మళ్లీ ఎమ్మెల్సీ అవకాశం రాకపోవడంపై అసంతృప్తి లేదు

- సామాజిక సమీకరణాల నేపథ్యంలో పదవి దక్కలేదు
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి రాకపోవడంపై తనకు ఎలాంటి అసంతృప్తి లేదని, సామాజిక సమీకరణల నేపథ్యంలో రాలేదని భావిస్తున్నానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పదవులతో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. రాజకీయాల్లో ముందస్తు హామీలు ఉండవని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు జీవన్‌రెడ్డి సమాధానం చెప్పారు. జగిత్యాలలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. పసుపు, మొక్కజొన్న, కంది పంటలకు మద్దతు ధర కల్పించాలని, మొక్క జొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇసుక అందుబాటులో లేకపోవడం వల్ల నిర్మాణ రంగం కుంటుపడింద న్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అందుబాటులో ఉంచిందని, జిల్లాలో అక్రమ ఇసుక డంపులపై కలెక్టర్ చొరవ చూపడడం అభినందనీ యమన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశిస్తే మరింత ధర తగ్గడంతో ఆందోళన చెందుతు న్నారని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, కాంగ్రెస్ నాయకులు శీలం సురెందర్, కండ్లపెల్లి దుర్గయ్య తదతరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బద్ది పోచమ్మ ఆలయం వద్ద క్యూలో భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ శ్రీబద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెల కొంది. అమ్మవారికి భక్తులు ఉదయాన్నే మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలి వచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకునేందుకు రావడంతో క్యూలైన్‌లో భక్తులు బారులు గంటల తరబడి నిరీక్షించారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు పట్నాలు వేసి నూతన వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి అమ్మవారికి నైవేద్యంపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌చార్జి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివపార్వతుల కల్యాణం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మల్యాల గ్రామంలోని విశ్వేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శివ పార్వతుల కల్యాణం ఆలయ అర్చకులు నిట్టూరి సతీష్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి లెక్కల కవిత శ్రీనివాస్‌రెడ్డి, కామిడి పద్మశ్రీనివాస్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. శివాలయం కమిటీ అధ్యక్షుడు కాసర్ల మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు బసవత్తుల జ్ఞానేంద్ర చారి, కోశాధికారి ఉప్పుల రమేష్, కసార్ల సాగర్ రెడ్డి, సంజీవరెడ్డి, ఎర్రబాటి రవి, బూసి సదాశివరెడ్డి, కూనారం రమేష్, శీలం మల్లారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

ఇల్లందకుంట: మండలంలోని చిన్న కోమటిపల్లిలో వెలిసిన స్వయంభూ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనర్సింహస్వామిని పట్టువస్త్రాలతో అలంకరించి హనుమాన్ దేవాలయంలో ఎదుర్కోళ్లను నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ అర్చకులు ప్రదీప్‌శర్మ, నవీన్‌శర్మల ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ చిట్ల చంద్రమౌళి దంపతులు, చుక్క అరుణ రాణి- రం జిత్‌కుమార్, చుక్క రజిత-వేణు గోపాల్ స్వామివారికి కల్యాణ పట్టు వస్త్రాన్ని సమర్పించారు. అనంతరం చుక్క అరుణ రాణి- రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చం ద్రమౌళి, వైస్‌చైర్మన్ రమేష్, కోశాధికారి వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

గంగాధర: మండలంలోని ఉప్పర మల్యాల తుమ్మెద గుట్ట లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

- గర్షకుర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామికి హవనం, బలిహరణం, బేరిపూజ నిర్వహించారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం

తిలకించిన వేలాది మంది భక్తులు

పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి





ధర్మపురిలో శేషప్ప కళావేదికపై శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం, తిలకిస్తున్న భక్తజనం

ధర్మపురి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం మంగళవారం సాయంత్రం గోధూళి సుమహూర్తమున అత్యంత వైభవంగా జరిగింది. భారీగా తరలి వచ్చిన వేలాది మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం నరసింహ నామ స్మరణ చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవం పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వరస్వామి వారల ఉత్సవమూర్తులను సాయంత్రం వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ఆలయాల నుంచి బయటకు తీసుక వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనే గల శ్రీ మఠం యాగశాల స్థలంలో ఏర్పాటు చేసిన నూతన కల్యాణ వేదికపైన ఆశీనులు చేశారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, రుత్వికులు సంకల్పం, ఆచమనం, యజ్ఞోప వీతాధారణ, కూడజీర ధారణ, బాసికం ధారణ, అక్షితారోహణం, కళ్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమచార్య నేతృత్వంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు శాస్త్రోక్తంగా సనాతన సంప్రదాయ రీతిలో స్వామివారల కల్యాణోత్సవం జరిపించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎస్పీ అశోక్‌కుమార్, ఈవో సంకటాల శ్రీనివాస్, జగిత్యాల ఫస్ట్ క్లాస్ అడిషనల్ మెజిస్ట్రేట్ నారాయణ, ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, జక్కు రవీందర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, వేములవాడ దేవస్థానం మాజీ ఈవో దూస రాజేశ్వర్, ఎండోమెంట్ డీఈఈ రఘునందన్ భక్తులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు, ఎస్పీ అశోక్‌కుమార్, ప్రభుత్వ విప్, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్

పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహ (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి వారల కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మంగళవారం సమర్పించారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ కలెక్టర్ దంపతులకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదాలు బహూకరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మున్సిపల్ కమిష నర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, మేనేజర్ గంగాధర్, సిబ్బంది ఆలయానికి వెళ్లి స్వామివారలకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పుస్తెలు, మట్టెలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, డీపీవో మదన్‌మోహన్ ఉన్నారు.

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి

ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. స్థానిక దేవాలయం వద్ద ఆయన కొద్ది సేపు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షేత్రంలో పారిశుధ్య నిర్వహణ, వైద్య సౌకర్యం, వాహనాల పార్కింగ్, ఆర్‌టీసీ బస్సుల సౌకర్యం, పోలీస్‌శాఖ బందోబస్తు, ఇతరత్రా ఏర్పాట్లు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనసాగుతున్నట్లు వివరించారు.

ఘనంగా స్వామివారల ఎదుర్కోళ్లు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామివారల ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చిలుకముక్క హరిప్రసాద్ ఇంటికి శ్రీ లక్ష్మీనరసింహ (యోగ,ఉగ్ర) స్వామి వారల ఉత్సవమూర్తులను తీసుకవచ్చారు. అలాగే ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఇంటికి శ్రీ వేంకటేశ్వర స్వామివారలను తీసుకవచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్ కుమార్, రాజగోపాల్ శాస్త్రోక్తంగా పూజలు జరిపి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.







స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల కలెక్టర్ దంపతులు, ధర్మపురి మున్సిపల్ పక్షాన పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న కమిషనర్ దంపతులు

చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలి

రైతులతో కలిసి బీజేపీ ధర్నా

మెట్‌పల్లిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరిపించాలని మంగళవారం మెట్‌పల్లి పట్టణంలో బీజేపీ నాయకులు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు డాక్టర్ రఘు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చక్కెర ఫ్యాక్టరీని మూతపడేలా చేసిందని విమర్శించారు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నిర్లక్ష్యం కారణంగా దాదాపుగా పది వేల మంది కార్మిక, రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే పసుపు బోర్డు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పసుపు రైతుల సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. చక్కెర ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరిబాబు, పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేపీ నాయకులు ఏలేటి నరేందర్, చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, చెరుకు రైతులు

మద్దతు ధర చెల్లించాలి

పసుపు రైతుల మహాధర్నా

మెట్‌పల్లిటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : పసుపు పంటకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం మహాధర్నా నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి శాస్త్రీ చౌరస్తా వరకు రైతులు ర్యాలీగా వచ్చి ధర్నా చేపట్టారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పసుపు బోర్డు వచ్చిందని సంతోషపడాలో, పసుపు పంటకు మద్దతు ధర లేదని బాధపడాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధం గా పసుపు పంటకు కేవలం రూ.5 వేలు ధర ఉండటంతో పెట్టుబడి కూడా సరిపోవడం లేదన్నారు. రూ.15 వేలు మద్దతు ధర ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. అలాగే మార్కెట్ ఇంటర్వేషన్ స్కీంలో పసుపును కలపాలని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ చేరుకొని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.



మెట్‌పల్లిలో రైతుల ధర్నా

గ్రూప్-2లో 24వ ర్యాంకు సాధించిన రాకేష్



ఇల్లంతకుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గొట్టిపర్తి రాకేష్ గ్రూపు-2లో రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు సాధించాడు. ఉస్మానియా యూనివర్సిటీల పీజీ చేసిన రాకేష్ నెలరోజుల క్రితమే ఎక్సైజ్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా సిరిసిల్లలో విధులు నిర్వహిస్తున్నాడు.

34వ ర్యాంకు సాధించిన అఖిల్‌రెడ్డి



చందుర్తి: చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన ఎగుమామిడి సత్యనారాయణరెడ్డి -ఉమా దంపతుల కుమారుడు అఖిల్‌రెడ్డి గ్రూప్-2లో ఫలితాల్లో 34వ ర్యాంక్ సాధించాడు. అఖిల్‌రెడ్డిని మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు దూది శ్రీనివాసరెడ్డి, నాయకులు, గ్రామస్థులు అభినందించారు.

95వ ర్యాంకు సాధించిన ప్రశాంత్‌రెడ్డి



జమ్మికుంట రూరల్, ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కాంతాల మల్లారెడ్డి- రజిత దంపతల కుమారుడు సాయి ప్రశాంత్‌రెడ్డి గ్రూపు-2 ఫలితాల్లో స్టేట్ 95వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. ప్రశాంత్‌రెడ్డి గ్రూప్4లో ఉద్యోగం సాధించి రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డిని విస్‌డమ్ జూనియర్ కళాశాల, చాణిక్య డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం, గ్రామస్థులు అభినందించారు.

ప్రతిభ చాటిన భువన



సిరిసిల్ల: సిరిసిల్లలోని అశోక్ నగర్‌కు చెందిన బుర్ర భువన గ్రూప్ పరీక్షల్లో ప్రతిభ చాటింది. సిరి సిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుర్ర కృష్ణప్రసాద్ గౌడ్ కూతురు భువన సోమవారం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో 456 మార్కులు సాధించగా మంగళవారం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో 374 మార్కులతో రాష్ట్రవ్యాప్తంగా 363 ర్యాంక్ పొందారు. గ్రూప్-4లో ఉద్యోగం సాధించి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, గ్రూప్-1, గ్రూప్-2 లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

235 ర్యాంకు సాధించిన సంతోష్



గంభీరావుపేట: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మెతుకు సంతోష్ అనే యువకుడు గ్రూప్ 2లో 235 ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మెతుకు సంతోష్ గతంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. మంగళవారం వెలువడ్డ గ్రూప్ 2 పరీక్ష ఫలితాలు సంతోష్‌కు 380 మార్కులు రాగా, 235 ర్యాంకు వచ్చింది.

రైతుల దీక్షకు బీజేపీ నాయకుల సంఘీభావం

ఇల్లంతకుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కెనాల్ పనులు పూర్తిచేసి సాగునీరు అందించాలని రైతులు చేపట్టిన రిలే దీక్షకు బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో ఎల్ఎమ్ 6కెనాల్ పనులు పూర్తిచేయాలని ఇల్లంతకుంట, తంగళ్ళపెల్లి మండలాలకు చెందిన రైతులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఇల్లంతకుంట, తంగళ్ళపెల్లి మండలాల బీజేపీ అధ్యక్షులు భూమల్ల అనీల్‌కుమార్, వెన్నమనేని శ్రీధర్‌రావులు మాట్లాడారు. ఇటికాల రాజు, నాగుల శ్రీనివాస్, సిలువేరు ప్రశాంత్, అమ్ముల అశోక్‌యాదవ్, దండవేని రజనీకాంత్, తుమ్మనపల్లి కమలాకర్, రైతులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో జిల్లా స్థాయిలో జరిగే బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని అంకారపు ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం జరిగింది. ఆత్మీయ సమ్మేళనం సిరిసిల్లలో ఈనెల 16న జరుగుతుందని కేంద్రహోం సహాయ మంత్రి బండి సంజయ్ హాజరవుతారని కార్యకర్తలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని గోపి కోరారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు రాంప్రసాద్, పార్లమెంట్ కో కన్వీనర్ అడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరి భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలోనే 'ఉపాధి'

(5వ పేజీ తరువాయి)

కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతోంది. పని ప్రదేశాల్లో తాగునీటి సదుపాయం లేక ఇళ్లనుంచే నీటి డబ్బాలు వెంట తెచ్చుకుంటున్నారు. మరికొందరు తడారిన గొంతుతో తల్లడిల్లుతున్నారు. పని ప్రదేశాల్లో నేల గట్టిగా ఉండటంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్లుగా పనిముట్లు అందించడంలేదు. దీంతో కూలీలే ఎవరికి వారు పనిముట్లు తెచ్చుకుంటున్నారు. కూలీలకు గాయాలు జరిగిన సందర్భంలో ప్రాథమిక చికిత్స కిట్లు సమకూర్చాలి. కిట్లో అయోడిన్, బ్యాండేజీ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కొన్ని రకాల మాత్రలు అందుబాటులో ఉంచాలి. గత కొన్ని సంవత్సరాల నుంచి వీటి పంపిణీ నిలిచిపోయింది. కూలీలు తమ పని దినాల వివరాలు రాసేందుకు ఉపాధి హామీ కూలీలకు జాబ్ కార్డులో అందకపోవడంతో ఇంటివద్ద నుంచే నోట్‌బుక్స్ తెచ్చుకుంటున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి జాబ్ కార్డులు రావడంలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎనగల్ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు

అలవెన్స్ ఇవ్వడం లేదు..

- పున్ని రేణుక, గొల్లపల్లి



ప్రభుత్వం గతంలో కూలీలకు వేసవి అలవెన్స్ ఇవ్వగా, ఈసంవత్సరం ఇంతవరకు ప్రారంభం కాలేదు. ఎండలో పనిచేయడం ఇబ్బందిగా మారింది. పనిముట్ల సరఫరా లేకపోవడంతో వచ్చిన కూలిడబ్బుల్లో నుంచి పనిముట్లు కొంటున్నాం. జనవరిలో కూలి డబ్బులు అకౌంట్లో పడగా, ఇంతవరకు రాలేదు. పనిప్రదేశాల వద్ద అన్ని విధాలైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

చేతికి బొబ్బలు వస్తున్నాయి..

- సుంకరి నర్సయ్య, అక్కపల్లి



మా ఊరిలోని కామునిచెరువులో ఉపాధి పనులు చేస్తున్నాం. మట్టి గట్టిగా ఉండడం వల్ల తవ్వేందుకు ఇబ్బందవుతోంది. చేతులు బొబ్బలు వస్తున్నాయి. కొలతలు తగ్గించాలి. ఎండలో పనులు చేయడం వల్ల ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్ల సరిపోవడం లేవు. పనులు చేస్తున్న క్రమంలో గాయాలైతే వైద్యం అందించేందుకు మందులు లేవు.

నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్నాం..

- మందాటి మల్లవ్వ, అక్కపల్లి



పొద్దుగాల ఏడు గంటలకు పోతే ఇంటికి వచ్చేసరికి ఒంటిగంట అవుతోంది. ఊరికి దూరంలో ఉన్న కాముని చెరువులో మట్టి తీత పనులకు పోతున్నా. తాగేందుకు ప్రతి రోజు ఇంటి నుంచే నీళ్ల బాటిళ్లు వెంట తీసుకుపోతున్నా. నీళ్లు సరిపోవడం లేవు. ఎండలోనే పనులు చేయడం వల్ల దూపయితంది. తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి.

కూలి డబ్బులు రావడం లేదు..

- రెడ్డి మల్లవ్వ, తంగళ్లపల్లి



ఉపాధిహామీ కూలి డబ్బులు సక్రమంగా రావడం లేదు. గతంలో 15 రోజులకు అకౌంట్‌లో జమ అయ్యేవి. నెల 15 రోజులవుతున్నా డబ్బులు రాలేదు. ప్రస్తుతం రోడ్డు పనులు చేస్తున్నాం. రోడ్డు పక్కన చెట్ల పొదాలు తొలగిస్తుంటే పాములు వస్తున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనులు చేస్తున్నాం.

ప్రయాణ భత్యం చెల్లించడం లేదు..

- పసుల మల్లవ్వ, ఎనగల్



గత కొన్ని సంవత్సరాలు నుంచి ఉపాధిహామీ పనులకు హాజరయ్యే వికలాంగులకు కూలీలకు ప్రయాణ భత్యం చెల్లించడం లేదు. తాగునీటి సరఫరా కూడా జరగడం లేదు. గతంలో గడ్డపారలకు డబ్బులు ఇచ్చేది.. ఇప్పుడు ఇస్తలేరు. వికలాంగులకు పని సమయం తగ్గించాలి.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఎల్లారెడ్డిపేట, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులంలో డిగ్రీ కళాశాలలో(బాలురు) ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కే. వీరప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తిచేసిన బీసీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు, పట్టణ వాసులు రూ.2లక్షల లోపు ఉండి ఇంటర్‌లో 40 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు అని చెప్పారు. విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ పత్రం, పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితా పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీరప్రభాకర్ కోరారు.

కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఏపీ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధ వెంకన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి బుద్ధ వెంకన్నకు లేదని, తక్షణం వ్యాఖ్యలను వెనక్కితీసుకొని కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయం చేయాలనుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో చేసుకోవాలని, కేటీఆర్‌పైన గానీ తెలంగాణ ప్రజలపైన గానీ మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. తెలంగాణలో పాతరోజులను తీసుకురావాలని చంద్రబాబునాయుడు కలలు కంటున్నాడని అది కలగానే మిగిలిపోతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మట్టే శ్రీనివాస్, కోడం వెంకటేష్, నవీన్, రుద్రవీణ, సుజిత్, గాజుల మహేష్, వినయ్ పాల్గొన్నారు.

ఇసుక కొరత సమస్యను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఇసుక కొరత సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. స్థానిక కొత్త బస్టాండు ప్రాంతం నుంచి ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లారు. ఇసుక రీచ్‌ల ఏర్పాటులో అధికారుల అలసత్వంవల్ల భవన నిర్మాణాలు ముందుకు సాగక అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో ఏర్పాటు చేసిన రీచ్‌లను కొనసాగించాలన్నారు. తహసీల్దార్ రామచంద్రంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీశైలం, గాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, రవినాయక్, కిరణ్‌నాయక్, ఆంజనేయులు, నరేశ్, భాస్కర్, స్వామి, పర్శరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, మధు, తిరుపతి, రాంరెడ్డి, నవీన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో 150 అక్రమ కేసులు

- మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు

సిరిసిల్ల టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమంగా 150 మందిపై రౌడీ షీటర్ కేసులు పెట్టారని మాల మహానాడు జాతీయకార్యదర్శి రాగుల రాములు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమాలలో ఉన్నవారిపై కూడా అక్రమంగా కేసులు పెట్టారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూ కబ్జాలకు పాల్పడిన ఒక్కరిద్దరిపై కేసులు పెడితే ఎందుకు గగ్గోలు పెడుతున్నారని ప్రశ్నించారు. ఒక్క కేసు ఉన్నవారిపైన రెండు కేసులు, రెండు కేసులు ఉన్నావారిపై నాలుగు అక్రమ కేసులు పెట్టారని ఉద్యమకారులపై కూడా కేసులు పెట్టారని బీఆర్ఎస్ ప్రభుత్వంలో చట్టాలను ఉల్లంఘించారని ఆరోపించారు. 150 మందిపై పెట్టిన అక్రమ కేసులపై ఈనెల 16న సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద వచ్చి మాజీ మంత్రి కేటీఆర్, కొండూరు రవీందర్‌రావు, తోట ఆగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాగుల రాములు

కూడా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తన భార్య పేరు మీద 3 ఎకరాలు భూమితో పాటు 30ఎకరాల భూమిని కూడా కబ్జాపెట్టాడని వీటి మీద ఆధారాలతో వస్తామన్నారు. దళితుల పక్షాన కేకే మహేందర్‌రెడ్డి ఉన్నాడని తనను మధ్యలోకి తీసుకురావద్దని అన్నారు. ఈనెల 16న అంబేద్కర్ చౌరస్తా వద్దకు రాకుంటే ఉద్యమాన్ని చేపడతామన్నారు. మాట్ల మధు కూడా అంబేద్కర్ చౌరస్తా వద్దకు రావాలన్నారు. తెలంగాణ ఉద్యమ జెండా పట్టుకున్నా కేకే మహేందర్‌రెడ్డిని పట్టుకొని అగౌరవంగా మాట్లాడడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు కంసాల మల్లేశం, అన్నల్‌దాస్ భాను, కొంపెల్లి విజయ్ పాల్గొన్నారు.

సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క కేసులో ఉన్నవారిపై న్యాయమూర్తి అనుమతులు లేకుండా అక్రమంగా రెండవ కేసు పెట్టి చట్టాన్ని ఉల్లంఘించారని ఆరోపించారు. సిరిసిల్లలో దళితుల భూములలో బీఆర్ఎస్ భవన్ నిర్మించారా లేదా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల శాంతినగర్‌లోని ఇందిరమ్మ ఇండ్లు, ఆయకట్టు కింద ఉన్న దళితుల వందల ఎకరాలు, టెక్స్‌టైల్ పార్కులో దళితుల భూములు గుంజుకోలేదా అన్ని ప్రశ్నించారు. వీటిపైన

విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

సిరిసిల్ల రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులను కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి, యువజన,ఉపాధ్యాయ, సామాజిక, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులతోపాటు ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాల్లారపు అరుణ్‌కుమార్, కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్న విద్యారంగం సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర ంగా విఫలమైందన్నారు. ప్రస్తుతం జరుగబోయే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30శాతం నిధులను కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని డిమండ్ చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసుతులను కల్పించి ఖాళీగాఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి విమల, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్ కుమార్, గర్ల్స్ కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు సాయిభరత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేత

గంభీరావుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట కేజీ టూ పీజీ క్యాంపస్‌లో పదో విద్యార్థులకు బీఆర్ఎస్ నేతలు మంగళవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, పట్టణ అధ్యక్షుడు పెద్దవేణి వెంకటి, యూత్ అధ్యక్షుడు రత్నాకర్, నాయకులు లింగమ్‌యాదవ్, వహీద్, రాజనర్సు, స్వామి, నాగరాజు, ఆనందం, మీనయ్య తదితరులు ఉన్నారు

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పెన్నులు, పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు శివరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, అశ్వాక్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 66మంది, మండెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 27 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్ పెన్నులను అందజేశారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాజన్న, మాజీ ఎంపీపీ పడిగల మానస రాజు, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, మాజీ సర్పంచ్ గణప శివజ్యోతి, గణప మదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బస్సు స్వప్న లింగం, బండి జగన్, నక్క రవి రాగిపల్లి కృష్ణారెడ్డి, బానుమూర్తి, అనిల్, రమేష్ తిరుపతి, లింగం, కనకరాజు, రమణ, బండి భాస్కర్ నేహూరి నవీన్, ప్రధానోపాధ్యాయుడు శంకర్ నారాయణ పాల్గొన్నారు.

ప్రణయ్ హత్య కేసులో న్యాయం గెలిచింది..

గంభీరావుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రణయ్ హత్య కేసులో న్యాయం గెలిచిందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం పేర్కొన్నారు. గంభీరావుపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రం మాట్లాడుతూ ఈ కేసులో ఒకరికి ఉరిశిక్ష, ఆరుగురికి జీవిత ఖైదు శిక్ష వేస్తు కోర్టు తీర్పు ఇవ్వడం మాలమహనాడు తరఫున స్వాగతిస్తున్నామన్నారు. ఈ పోరాటంలో ముందు నుంచి మాల మహానాడు ప్రణయ్ పక్షనా నిలబడిందన్నారు. బాధితుల తరపున నిలబడ్డ న్యాయవాదులు, పోలీస్, మీడియా ప్రతినిధులకు, మాల మహానాడు కార్యకర్తలతో పాటు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అనారోగ్యంతో శనిగరం రాములు మృతిచెందగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య మంగళవారం సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ నీరటి సాయికుమార్ అనారోగ్యంతో చనిపోయాడు. సాయికుమార్ అంత్యక్రియలు నిర్వహించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం వల్ల పలువురు ఆర్థికసాయం అందజేశారు.

రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ప్యాక్స్ ఛైర్మన్ గుండారపు కృష్ణారెడ్డిని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్ మంగళవారం ఘనంగా సన్మానించారు. లక్ష్మణ్‌రావు, కృష్ణహరి, రవి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసిన అధికారులు

సిరిసిల్ల రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంగళవారం అధికారులు ముగ్గులు పోశారు. హౌసింగ్ బోర్డుకు చెందిన అధికారులు గ్రామంలో పర్యటించిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా నిర్మించుకోవాలో అవగహన కల్పించారు. ఈ నెల చివరిలోగా బెసిమెంట్ వరకు నిర్మాణాలను చేపట్టాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి కమలాకర్‌రావు, హౌసింగ్ బోర్డు అధికారులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

చందుర్తి,మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టం చేసిన తర్వాతే గ్రూప్స్ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తర్రె శంకరయ్య మాదిగ అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదిగల పట్ల చూపుతున్న వివక్షను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు దుమ్ము రమేష్, ప్రధాన కార్యదర్శిలు బాబు మాదిగ, కట్కూరి ప్రశాంత్ మాదిగ, నాయకులు నేరెళ్ల దేవయ్య మాదిగ, సిరిసిల్ల ఆశయ్య మాదిగ, గొర్రె శంకర్ మాదిగ, బాబు మాదిగ పాల్గొన్నారు.

తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి

- ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మదన్మోహన్‌రెడ్డి

వీర్నపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వరి పంటకు అగ్గి తెగులు రాకుండా రైతులు చర్యలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మదన్మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంట పొలాలను జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వెంట మండల వ్యవసాయ అధికారి కుమారి జయ, ఏఈవో దీపిక, రైతులు ఉన్నారు.

● బోయినపల్లి : మండలంలోని మర్లపేటలోని వరి పొలాలను పరిశీలించి జిల్లా ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్), కరీంనగర్ శాస్త్రవేత్తలు మండల వ్యవసాయ అధికారి, రైతులకు సూచనలు చేశారు. సందర్శనలో జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.మదన్ మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఏం. రాజేంద్రప్రసాద్, ఏవో ప్రణీత పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో భూగర్భజలాలు తగ్గడంతో ఎండిపోతున్న పంటలను మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. పెద్దలింగాపూర్, రామోజిపేట, చిక్కుడువానిపల్లె తదితర గ్రామాలలో పంటలు ఎండిపోతున్నాయని, కెనాల్ నిర్మాణ పనులు చేపట్టాలని రైతులు రిలే నిరాహారదీక్షలు కొనసాగిస్తున్నారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతు కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంత విస్తీర్ణంలో పంటలు ఎండిపోతున్నాయని, నివేదిక తయారు చేసి ఉన్నతస్థాయి అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

బోర్‌వెల్ రీచార్జ్ సిస్టంను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈజీఎస్ పథకం ద్వారా రైతులు బోరువెల్ రీచార్జ్ సిస్టంను పొలాల్లో చేపట్టి సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలోని మహిళా రైతు పొలంలో ఏర్పాటు చేసిన బోరువెల్ రీచార్జ్ సిస్టం పంపును మంగళవారం ఆమె పరిశీలించారు. రైతులు వ్యవసాయ పొలాల వద్ద వృథా నీటిని ఇంకించి తిరిగి బోరు మోటారు ద్వారా వినియోగించుకోవాలన్నారు. వెంట ఎంపీడీవో సత్తయ్య, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య ఉన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి : డీఆర్‌డీవో శేషాద్రి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శేషాద్రి

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, యువతుల అపహరణలు, ప్రలోభాలకు గురిచేయడం వంటి వాటిపై చట్టాలపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీవో శేషాద్రి కోరారు. మంగళవారం సిరిసిల్లలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో జిల్లా మహిళ సమాఖ్య భవనంలో మానవ అక్రమ రవాణాపై ఏటీఎం, సీసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ పిల్లలను అపహరించడం, యువతులను ప్రలోభాలకు గురిచేసి వారిని వేశ్యాగృహాలకు అమ్మడం, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలన్నారు. చట్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో గొట్టె శ్రీనివాస్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులోని ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 14న స్వామివారి జాతర జరగనున్నాయి. అయితే బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో ముందస్తుగా ధర్మపురి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగ నర్సయ్య, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, కొమిరే శంకర్, తర్రె లింగం, స్వర్గం పరంధాములు, దేశవేని భూమేష్, సిరికొండ రవి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా మడేలేశ్వర స్వామి బోనాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మహిళలు గ్రామ పురవీధుల గుండా డప్పుచప్పుళ్ల నడుమ బోనాలను ఊరేగించారు. ఆలయం వరకు చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పలువురు నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఊరంతా పండుగ వాతావరణం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కోనరావుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సాధన సమావేశం అధ్యక్షుడు కచ్చకాయల ఎల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యాలయానికి అసంపూర్తిగా ఉన్న ప్రహరీగోడ నిర్మించాలని భద్రత కోసం గేట్లు ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు నాయిని ప్రభాకర్ రెడ్డి, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, లింబయ్య, వెంకన్న, లత, రాజేందర్, వాల్యనాయక్, మల్లారెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వట్టెంల సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ కారణంగా బుధవారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు సరఫరా ఉండదన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

చందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ మంగళవారం నిర్వహించారు. మూడపల్లి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మల్లేశం మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు జితేందర్, ఉపాధ్యాయులు అనిత, శ్రీదర్, రాజు, రమేష్, హరిక, ప్రణవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

వేములవాడ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ట్విన్నింగ్ స్కూల్ ప్రాజెక్టులో భాగంగా చందుర్తి ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు హన్మాజీపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులు తయారుచేసిన వినూత్న పరికరాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సినారె గ్రంథాలయాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు వేముల సుజాత, ఉపాధ్యాయులు గుర్రం బాలకిషన్, కొత్తూరి శ్రీదర్, రాచకొండ ప్రసాద్, బంటు వనిత, రాకం రవి, మమత, స్వప్న పాల్గొన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

తంగళ్లపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో ఈనెల 12వ తేదీన జిల్లా బీసీ సాధికారిత సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ కందుకూరి రామగౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పలాస నరేందర్ అధ్యక్షతన జరిగే విస్తృత సమావేశానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండ దేవయ్య హాజరవుతారని ప్రకటనలో తెలిపారు. అనుబంధం కమిటీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.